# తల్లిమనసు

"లైమైపోయింది శశీ! వెళ్తున్నాను''

అనేసి సైకిల్ బెల్లు మోయించి వెళ్ళిపోయాడు శివరాం— 'వచ్చేస్తున్నా నుండండి.' అంటోన్నా విన్పించుకో కుండా.

అన్నం వార్పుచేసి, పొయ్యి అలాగే వదిలేసి గబగబా వీధి గుమ్మం దగ్గిరికి వెళ్ళింది శశిరేఖ; ఎదరింటివేపు తీక్షణంగా చూస్తూ నించుంది.

ఎదరింటివాళ్ళ పిల్లవాణ్ణి గాలిలోకి ఎగరేసి ముద్దుపెట్టుకుంటున్నాడు శివరాం. అలాగే చూసింది శశి.

శివరాం ఆ పిల్లవాడి బుగ్గలు నిమురుతూ నవ్వుతూ ఏదో పల్కరించాడు. మళ్ళా ఓసారి ముద్దుపెట్టుకుని పక్కనే వున్న వాళ్ళమ్మచేతి కిచ్చి టాటా చెప్తూ సైకిలెక్కి దూసుకుపోయాడు

గిరుక్కున వెనక్కి తిరిగి లోపలికి వచ్చేసింది శశిరేఖ. డబ్బాలోంచి ఓ గుప్పెడు కందిపప్పు తీసి పొయ్యిమీది కెక్కించింది.

ఉయ్యాలలో అమాయకంగా నిద్ర బోతోన్న బిడ్డని చూస్తోంటే ఎంతవద్దనుకున్నా ఓ రకమైన నిట్టూర్పు వెలువడింది. కళ్ళు చెమర్చబోతే రెప్ప లల్లార్చి కన్నీటిని కళ్ళలోనే ఇంకించుకొంది. ఉయ్యాల తాళ్ళు పట్టుకుని కొడుకు మొహంలోకి తదేకంగా చూస్తూ నించుంది.

ఒక్క పదినిముషాల క్రిందట...

శివరాం తల దువ్వుకొంటూ గుమ్మం దగ్గిరికి వచ్చి అన్నాడు—"అన్నట్టు శశీ! మర్చిపోయాను. పెన్‌లో యింకు అయిపోయింది నిన్నే. కాస్త పోసి పెడుదూ! మళ్ళా నా చేతులకి యింకు అవుతుందేమో!"

శశి బాబుని భుజంమీద వేసుకు తిప్పుతోంది వాడికి నాలుగైదు రోజులనుంచీ ఒంట్లో బాగాలేదు—"కొంచెం వీణ్ణి తీసుకొండి ఇంకు పోసి యిస్తాను.'' అంటూ వాణ్ణి శివరాంకి అందివ్వబోయింది

'బాప్‌రే!'' కెవ్వు మని కేక వేసినంత పనిచేశాడు శివరాం "చాల్లే! ఇంకు పొయ్యకపోతే పోసీగానీ వాణ్ణి మాత్రం నే నెత్తుకోను వెధవ చీమిడిముక్కువాడూను. ఆ అధరామృతం కారింది కారినట్టే వుంటుంది. ఇవ్వాళే యిస్త్రీ

ముప్పాళ రంగనాయకమ్మ

బట్టలు వేసుకున్నానుకూడాను," అంటూ రెండడుగులు వెనక్కివేసి నించున్నాడు. శశి నవ్వుతూ పైటకొంగుతో కొడుకు ముక్కూ మొహం తుడిచింది— "పోనీ యిప్పుడు చూడండి; ఎంత నీటుగా వున్నాడో!"

"ప్లీజ్ ! ఉయ్యాల్లో వేసేద్దూ ! వాణ్ణి నమ్మలేం,'' అంటూ ప్రాధేయపూర్వకంగా చూశాడు. శశి నవ్వి బాబుని పడుకోపెట్టి ఇంకు పోసి పెన్ను అందించింది. 'అన్నం వుడికిపోయిందో ఏమో' అనుకొంటూ వంటగదికేసి వెళ్ళింది.

'పైపైపోతోంది శశీ !' అంటూ హడవుడిగా పరిగెత్తాడు శివరాం.

తీరా శశి వచ్చి చూసేసరికి కనపడ్డ దృశ్యం...శివరాం ఎదిరింటివాళ్ళ పిల్ల వాణ్ణి గాలిలోకి ఎగరేసి...చేతుల్లోకి అందుకుని...ముద్దులాడి..బుగ్గలునిమిరి.. టా టా చెప్పి......

ఆలోచించకుండా వుండలేకపోయింది శశి.

అలాంటి దృశ్యం ఇదివరకుకూడా చాలాసార్లు చూసింది. మొదట్లో మొదట్లో కుతూహలంగా చూసింది.

'వాళ్ళ పిల్లాడు బావుంటాడుకదూ?' అని శివరాం అంటే 'బాగానే వుంటాడు.' అంది మనస్ఫూర్తిగానే.

రెండుమూడుసార్లు ఆ పిల్లాణ్ణి శివరాం ఎత్తుకుని ఇంటికికూడా తీసుకువచ్చాడు – 'తినటాని కేమైనా వున్నాయా శశీ' అని అడిగితే – 'ఏం వున్నాయి ? బెల్లం ముక్క పెట్టనా ?' అంది నవ్వుతూ. ఆ మర్నాడే కాబోలు శివరాం బిస్కట్ల పేకెట్ తీసుకొస్తే – "ఇదేమిటి ? మన వాడు అప్పుడే బిస్కట్లు తింటాడా ?" అంది ఆశ్చర్యంగా.

'అబ్బే : వాళ్ళ బుజ్జికోసం తెచ్చాలే' అని, బయటికి వెళ్ళేప్పుడు ఆ పేకెట్టు కూడా పట్టుకువెళ్ళాడు శివరాం.

'మన వెధవ తినేసరికి ఇలాంటివి ఎన్ని తెచ్చుకోవాలో !' అంటూ తనూ వీధిగుమ్మంవరకూ వెళ్ళింది.

కాని...శశిమనస్సు అంత తేటగా ఎంతకాలం వుండగలదు ? శివరాం పరాయి పిల్లవాణ్ణి అంత ఆప్యాయంగా ముద్దులు పెట్టుకొంటోంటే కళ్ళారా చూసే శశి ఒకరకమైన ఆవేదనతో – 'ఇది అసూయకాదుగదా ?' అంటూ తనను తను ప్రశ్నించుకొంది చాలాసార్లు.

పసిబిడ్డని..ఎవరిబిడ్డకానీ...ప్రేమతో ముద్దు పెట్టుకున్నంతమాత్రాన ... తను యిలా బాధ పడటంలో అర్థం వుందా ? తన సంస్కారం ఇంత సంకుచితమా ? ఎన్నో చదివి తెలిసికోగలిగే తనలో ఇంత మూర్ఖత్వమా ?– తన విమర్శలకు తనే తట్టుకోలేక సిగ్గుపడిందికూడాను. శివరాంని అపార్థం చేసుకోకూడదన్న ఆలోచన శశిని కొంత నిశ్చింతగా వుండ నిచ్చింది.

కాని...పసిబిడ్డని ప్రేమించటమే అతని తత్వం అయితే ఆ ప్రేమ తన బిడ్డకి ఎంతవరకూ దక్కుతోంది ? తన బిడ్డమాత్రం పసివాడుకాడా ? పైగా అస్వస్థతలతో అర్భకంగా తయారౌతున్న బిడ్డని ప్రేమించాల్సిన అవసరం ఎక్కువగా లేదా ?

శివరాం కొడుకుని ప్రేమించటంలేదని ఆ క్షణంవరకూ అనుకోలేదు శశి. కాని శివరాం ప్రవర్తన ఏవిధంగా సరి పెట్టుకోగలదు ?

ఆరోజు... శశి మరొకసారి అదే దృశ్యం చూడటంతో... ఒక నగ్న సత్యం... తిరస్కారం చాలా పరిమిత మనీ... తన హృదయం చాలా స్వార్థ పూరిత మనీ... బాగా తెలిసివచ్చింది.

తనభర్త... పరాయి స్త్రీ కన్నబిడ్డని అలా నవ్వుతూ ముద్దులాడుతోంటే నిష్కల్మషంగా చూసి సహించగలిగేంత మంచిది కాదేమో తను ఇన్నాళ్ళూ తను వుపేక్షించింది. చాలా పొరపాటు చేసింది — తన వివేకం వుత్తదేకానీ ! తనహృదయం చెడ్డదేకానీ : శివరాం... పరాయి పిల్లవాణ్ణి అంత యిష్టపడటాన్ని తను సమర్థించదు.

శివరాంకి...కొడు కున్నాడు.

శివరాం రక్తాన్ని పంచుకు పుట్టి... శివరాంని తండ్రిగా ఎంచుకు పెరుగు తోన్న కొడుకు వున్నాడు. ఎవ రే అన్యా యము చేసినా అర్థం చేసుకోలేని పసి తనంలో వున్నాడు. శివరాంనుంచి పసి బిడ్డకు లభించే ఏ ప్రేమైనా వాడికే పరిమి తము కావాలి వాణ్ణి చూసీ చూడగానే శివరాం కన్నుల్లో జ్యోతులు వెలగాలి. వాడికోసమే శివరాం చేతులు ముందుకు సాగాలి. శివరాం నిజమైన కన్నతండ్రిగా తన బిడ్డని ప్రేమించాలి.

రోజంతా అదే ధ్యాసగా వుంది శశికి.

రాత్రి... భోంచేసి గదిలో కూర్చుని పుస్తకం చదువుకోవటంలో నిమగ్న మయ్యాడు శివరాం.

శశి అన్నం వడ్డించుకునే ప్రయ త్నంలో వుంది,

బాబు నిద్రలో వులిక్కిపడి లేచి రాగం అందుకున్నాడు. అందుకే ఎదురు చూస్తోన్నట్టు శశి గబగబా వుయ్యాల్లోని వాణ్ణి లేవదీసి గదిలోకి తీసికెళ్ళి శివరాంకి అందిస్తూ అంది — "కాస్సేపు వీణ్ణి ఎత్తు కోండి. నేను అన్నం తిని కంచాలు కడిగి వస్తాను. అన్నట్టు రేపటికి పప్పుకూడా నానబొయ్యాలి."

పుస్తకంలోంచి తలే ఎత్తలేదు శివరాం.

"మిమ్మల్నే. విన్పించటంలేదూ?" రెట్టించింది శశి.

"అబ్బ ! ఏమిటి శశీ ? " ఇబ్బందిగా చూశాడు.

"కాస్సేపు వీణ్ణి ఎత్తుకోమంటున్నాను నాకు పని వుంది."

"నేను చదువుకుంటున్నాను శశీ ! సీరియల్స్ పూర్తి చేయాలిగా ? "

"మీరు చదువుకోవటం నా కేం కన్పించటం లేదా ? ఏడుస్తున్నా డని తీసుకువచ్చాను. అసలే ఒంట్లో బాగాలేదు."

"ఫర్వాలేదులెద్దూ ! అలా పక్కమీద పడుకోబెట్టు. చూస్తూ వుంటాను."

శశిరేఖ మొహంలో కోపం తాండవించింది. తీక్షణంగా చూస్తూ అంది—

"చూస్తూవుంటారా? రొంపతో జ్వరంతో బాధపడుతూ పసిబిడ్డ ఏడుస్తోంటే చూస్తూ వుంటారు కదూ? ఎంత జాలి! కన్న కొడుకు...పరాయి పిల్లవాడి మాత్రం తోచలేదేం?"

అర్థం కానట్టు చూశాడు శివరాం— "అదేమిటి? ఎందుకలా అన్నావు?"

"ఎందుకో అన్నాను. మతిపోయి అన్నాను"

"పరాయి పిల్లవాడెవరు? ఎవర్నెత్తుకున్నాను నేను?

"లేరు ఎవ్వరూలేరు. మీరు ఎవ్వర్నీ ఎత్తుకోవటం లేదు, ముద్దులాట్టం లేదు, షికార్లు తిప్పటంలేదు. నేను...అక్కసుకొద్దీ అంటున్నాను. ఉత్తపుణ్యానికే అంటున్నాను." కోపాన్నంతా వెళ్ళబెట్టేసింది శశి.

"శశీ! వాళ్ళ బుజ్జిని అప్పుడప్పుడూ ఎత్తుకుంటా ననేకదూ?" సావధానంగా చూశాడు శివరాం.

"అప్పుడప్పుడూ ఏంఖర్మ? ఎల్లప్పుడూ ఎత్తుకు తిరగివచ్చునే!"

"నువ్వు మాట్లాడే దేదో తిన్నగా మాట్లాడరాదూ?"

శశి కోపంతో రెచ్చిపోతూ అంది— "ఇంకా ఏం తిన్నగా? ఎంత తిన్నగా? పొద్దుటికి పొద్దుట పిల్లాణ్ణి ఎత్తుకోమంటే బట్టలు పాడుచేస్తాడనీ—చొంగ కారుస్తాడనీ...వంకపెట్టి తప్పించుకున్నారు. వస్తున్నా నుండమంటోన్నా విన్పించుకోకుండా పైపైపోతోం దని హడావుడిగా పరిగెత్తారు. తీరా గుమ్మం దాటింతర్వాత మీరు చేసిం దేమిటి? ఆ ఎదరింటివాళ్ళ పిల్లణ్ణి గాలిలోకి ఎగరేసి బంతులాట ఆడటానికి పై మెక్కణ్ణుంచి వచ్చిందీ? వాడు మీ బట్టలు పాడుచెయ్యడన్న నమ్మకం ఎలా కుదిరిందీ? అలాంటి దృశ్యం నేను ఎన్నిసార్లు చూశానో... చూసినప్పుడల్లా నన్ను నే నెంత సమర్థించుకొంటూవచ్చానో మీకు తెలుసా?

"మీరు...మీకై మీరు...ఒక్కసారి కూడా బాబుని చేతుల్లోకి తీసుకోలేదు. ఎన్నోసార్లు ఎమ్మల్ని ప్రాధేయపడి నిష్ఠూర పెట్టి, బలవంతం చేసి అందించాను. ఒక్కసారికూడా వాణ్ణి మీరు మనస్ఫూర్తిగా ముద్దు పెట్టుకోలేదు. వాడికేసి ఒక్క క్షణంకూడా రెండుకళ్లు పెట్టుకు చూడలేదు—ఇంట్లో బిడ్డకి రొంప పట్టినా...జ్వరం వచ్చినా... విరోచనాలైనా...అకస్మాత్తుగా చావుకి సిద్ధమైనా చలించరు మీరు...వాడి గురించి ఏ మంచి చెడ్డలూ మీ మనస్సుకంటవు. తెలుసు నాకు...తెలుసు." శశి గొంతు భారమైపోయింది. గాభరాగా లేచాడు శివరాం.

"ఛ! శశీ! ఏమిటది? ఎందుకంత కోపం? నే నేమంత కానిపని చేశాననీ?"

శివరాం మొహంలోకి సూటిగా

చూసింది శశి – "కానిపని అంటే ఏమిటి? పరాయిపిల్లల్ని ముద్దు చేస్తూ కన్నబిడ్డల్ని నిరసించటం కానిపని కాదని చెప్పగలరా? మీ సీరియల్ కథల కోసం జ్వరంతో బాధపడుతోన్న బిడ్డని ఏడిపించటం కానిపని కాదని చెప్పగలరా? ఎందుకు వాడిమీద మీకంత కసి? మీనుంచి ఎలాంటి ప్రేమా వాడికి అందకూడదా?"

శివరాంకి చాలా కోపం వచ్చింది – "శశీ! నీకై నువ్వు ఏవేవో వూహించుకుని బాధపడుతున్నావు, గానీ ఒక్కటి కూడా నిజంకాదు. నేను వాళ్ళ పిల్లాణ్ణి ఎత్తుకుంటానని నువ్విన్ని నిష్ఠూరాలాడటం బాగాలేదు. ఆ పిల్లాడు తెల్లగా.. బొద్దుగా... ఉంగరాల జుత్తూ... అదీ చూడగానే ముద్దువస్తాడు. వాణ్ణి చూస్తే నేనే కాదు, ఎవ్వరైనా చేతుల్లోకి తీసుకోకుండా ఉండలేరు.

నిర్ఘాంతపోయినట్టే చూసింది శశి. గిర్రున వెనక్కి తిరిగి వంటింట్లోకి వెళ్ళిపోయింది.

తెల్లబోయాడు శివరాం. అక్కడే నించున్నాడు చాలాసేపు. నెమ్మదిగా వంటింటి గుమ్మందగ్గరకెళ్ళి నిలబడ్డాడు.

బాబు వుయ్యాల్లో నిద్రపోతున్నాడు. శశి తలదించుకు గబగబా అన్నం తింటోంది.

"శశీ! నీకు కోపంవచ్చింది కదూ?" అదోమాదిరిగా అడిగాడు శివరాం.

"లేదు" శశి తలఎత్తలేదు – "నేనే

పొరపడ్డాను. నిజమే, పిల్లలంతా చూడగానే ముద్దువచ్చేంత అందంగానే వుండాలి. తెల్లగానే వుండాలి. లేకపోతే ఎలా ఎత్తుకోగలం? ఎందుకెత్తుకోవాలి? నిజమే. నేనే పొరపడ్డాను."

శివరాం కాస్సేపు శశికేసే చూసి గబగబా వెళ్ళి సీరియల్‌కథ మూసిపెట్టి పక్కమీద పడుకున్నాడు.

*　　*　　*

మర్నాడుపుదయం — బద్ధకంగా లేచి గదిలోంచి బయటికి వచ్చాడు శివరాం. వంటింటిగడపలో చాపమీద పక్కవేసి పడుకోబెట్టిన బాబు...చాపకి బారెడు దూరంలో నీళ్ళతడిలోకి కాళ్ళు పెట్టి బోర్లా పడుకున్నాడు. అంతవరకూ శశి రేఖ పప్పు రుబ్బటంలో మునిగి కొడుకువేపు చూడనేలేదు శివరాం బైటకి వచ్చినప్పుడే తలతిప్పిచూసింది. టూత్‌బ్రష్ ఇవ్వటానికి లేచింది.

వస్తూనే శివరాం కొడుకుని సరిగా పక్కమీద పడుకోబెట్టే వుద్దేశ్యంతో లేవదీయబోయాడు. శశి చటుక్కున వాణ్ణి అందుకుని భుజంమీద వేసుకొంటూ — టూత్‌పేస్ట్ తెచ్చి యిచ్చింది — "తొందరగా మొహం కడుక్కోండి. చాలా ఎండెక్కింది," అంది మామూలుగా.

"రాత్రి చాలా సేపటివరకూ నిద్ర పట్టలేదు శశీ!"

విని వూరుకుంది శశి.

శివరాం మొహం కడుక్కుని వచ్చి కొడుకుదగ్గిర చాపమీద కూర్చున్నాడు. బాబు బొటనవేలు నోట్లో పెట్టుకుని చూస్తూ పడుకున్నాడు. శివరాం వాడిమీద చెయ్యి వెయ్యబోతే శశి వారిస్తోన్నట్టే అంది — "వాణ్ణి అంటుకుంటే ఎత్తుకోమని ఏడుస్తాడు. చూస్తూ పడుకున్నాడుగా? ఫర్వాలేదు."

శశి అట్లు వెయ్యటం పూర్తిచేసి శివరాం ముందు పెట్టింది. తను బియ్యం ఏరుతూ కూర్చుంది.

శివరాం టిఫిన్ కాఫీ అయ్యాక పేపరు చూస్తూ కూర్చున్నాడు. బాబు వున్నట్టుండి బోర్లపడి నుదురు చాపకి ఒత్తుకుని కేరుమన్నాడు. శివరాం పేపరు పడేసి రెండంగల్లో వచ్చాడు. అప్పటికే శశి కొడుకుని ఒళ్ళో పడుకోబెట్టుకొంటూ — "నేనెత్తుకుంటానులెండి. మీరు పేపరు చదువుకోండి మళ్ళా ఆఫీసు వేళౌతుంది," అంది.

"నువ్వు బియ్యం ఏరుతున్నావుగా? నేనెత్తుకుంటాను."

"అబ్బే! వాడికి పాలుకూడా యివ్వాలి. పోనీ బియ్యం ఏరండి యిలా కూర్చుని," అంది నవ్వు తెచ్చుకొంటూ.

"నాకు చేతకాదులేవోయ్" అంటూ మళ్ళా పేపరు అందుకున్నాడు శివరాం.

శశి బాబుని ఒళ్ళోనే పడుకోబెట్టుకుని బియ్యం ఏరింది. కూరముక్కలు తరిగింది... దాదాపు ఎత్తుకునే పను లన్నీ

చేసింది. శివరాం స్నానం చేసి భోంచేసి ఆఫీసుకి బయల్దేరాడు. శశి ఎప్పట్లా శివరాం వెనక వెళ్ళలేదు. వీధి గుమ్మం కేసి చూడలేదు. సాయంత్రం ఇంటికి వస్తూనే అడిగాడు శివరాం —

"బాబుకి జ్వరం తగ్గిందా ?"

"బాగానే వుంది."

"ఏమిటి ? జ్వరమా ?"

బాబు వుయ్యాల్లో నిద్రపోతూ కన్పించాడు. లేచినప్పుడల్లా శశే హాజరై వుయ్యాల వూచి వాణ్ణి ఎత్తుకు సముదాయించి కిక్కురుమనకుండాజేసి పనులన్నీ చేసుకొంది.

రాత్రి... శివరాం స్నానం చేసి పుస్తకం చదువుకొంటూ కూర్చుంటే "అన్నం వడ్డిస్తాను. రారాదూ?" అంటూ పిలిపింది.

ఇద్దరం కలిసి భోంచేద్దాంలే. వాణ్ణి నిద్రపోనీ !" పుస్తకం మూయకుండానే జవాబు చెప్పాడు శివరాం.

"అప్పుడే నిద్రపోడు. ఇప్పటివరకూ పడుకునే లేచాడు. ఫర్వాలేదు. ముందు మీకు వడ్డించేస్తాను;" అనేసి లోపలికి వెళ్ళి పీట వేసి అన్నం వడ్డించింది. శివరాం లేచివెళ్ళాడు. భోంచేస్తూ చాలా విషయాలు తనకై తనే మాట్లాడాడు. కూరల్ని పొగిడాడు — ఉన్నట్టుండి — "ఏం ? అంత ముభావంగా వున్నావ్ ?" అంటూ శశి మొహంలోకి చూశాడు.

"అబ్బే ! ఏంలేదు. మీ రేదో చెప్తోంటే వింటున్నాను." అంటూ లేచి కొడుకుని వుయ్యాల్లో పడుకోబెట్టింది.

"వాడు పడుకున్నాడు గాని నువ్వు వడ్డించేసుకోరాదూ ?"

"మీ కంచం తీసేసి కూర్చుంటాను. అయిపోవచ్చిందిగా" రెట్టించ లేదు శివరాం. చెయ్యి కడుక్కు లేచాడు. నిద్ర పోతున్న కొడుకు కేసి ఒక్కసారి చూసి ఒక్కపొడి నములుతూ వీధి గుమ్మంలోకి వెళ్ళాడు. ఎదరింటి దంపతులు కొడుకుని ఆడిస్తూ వీధిలో కుర్చీలు వేసుకుకూర్చున్నారు ఆ సందు సాయంత్రం అయ్యేసరికే నిర్మానుష్యంగా ప్రశాంతంగా వుంటుంది. రాత్రుళ్ళు భోజనాలు చేసి ఆడవాళ్ళూ మగవాళ్ళూ కాస్సేపు ఆరుబయట కూర్చుని...ఒకళ్ళనొకళ్ళు పల్కరించుకుని... కావలసినంత గాలి పీల్చుకుని...నిద్రాదేవత ఆవరిస్తోంటే ఇళ్ళల్లోకి పోవటం పరిపాటే.

శివరాంని చూస్తూ ఎదరింటావిడ కుర్చీలోంచి లేచింది. "రండి అన్నయ్యగారూ! వదినగా రింకా భోం చెయ్యలేదా?" అంటూ పలకరించింది — "ఒరేయ్ బుజ్జీ ! మామయ్యగా రొచ్చార్రా ! వెళ్ళు! ఎత్తుకుంటారు," అంటూ చంకలో పిల్లాణ్ణి చనువుగా శివరాంకి అందించింది.

శివరాం బుజ్జిని ఎత్తుకుని ఒళ్ళో కూర్చొబెట్టుకున్నాడు. ఆవిడ భర్తకేసి చూస్తూ అంది — "మన బుజ్జీ అంటే అన్నయ్యగారికి చాలా యిష్టమండీ ! ఈ వెధవని ఎత్తుకోకపోతే ఆయనకి తోచదో ఏమిటో అనుకుంటాను," అంటూ నవ్వింది.

శివరాం నెమ్మదిగా లేచాడు. బుజ్జిని వాళ్ళ నాన్నకి అందిస్తూ అన్నాడు— "వస్తానండీ! మావాడికి కొంచెం ఒంట్లో బాగాలేదు. లేస్తాడేమో! వాళ్ళమ్మ అన్నం తింటోంది. వస్తానమ్మా!" అంటూ గబగబా లోపలికి వచ్చేశాడు.

శశి బాబుని భుజంమీద వేసుకు తిప్పుతోంది అన్నం తింటూ తింటూ లేచినట్టు — పళ్ళెంలో మజ్జిగఅన్నం మిగిలే వుంది. శివరాం బాబుకోసం చేతులు జాపుతూ—

"ఇలా ఇవ్వు శశీ! నీ భోజనం కానీ!" అన్నాడు.

"ఫర్వాలేదు, నిద్రపోయాక తింటాలెండి;" అంటూ శశి అన్నంపళ్ళెం మీద ఓ ప్లేటు మూతపెట్టింది.

"పోనీ నే తిప్పుతాగా? తొందరగా తెముల్చుకు రారాదూ?"

"మీ దగ్గిర వుండడు, ఒంట్లో బాగా లేదు."

"ఎందు కుండడూ? వాడి కేం తెలుస్తుందీ?" అంటూ చొరవగా కొడుకుని తీసుకోబోతోంటే శశి యివ్వలేదు— "వద్దులెండి. నా కిక ఆకలిగాకూడా లేదు. అన్నం తినను. నేనే నిద్రబుచ్చుతాను."

"శశీ!" తీక్షణంగా చూశాడు శివరాం— "పొద్దుటినుంచీ చూస్తున్నాను. బాబుకి నా చిటికెనవేలుకూడా తగలనివ్వకుండా చేస్తున్నావు. నేను గ్రహించలేదనుకున్నావా?"

శశి నిర్లక్ష్యంగా అంది— "మీరు గ్రహిస్తే చాలా సంతోషం. నా ప్రయత్నంకూడా అందుకే."

"అంటే ఏమిటి నీ వుద్దేశ్యం?"

"గుండెల్లో దాచుకు కుళ్ళిపోవటం నా వుద్దేశ్యంకాదు: మీ కిష్టం లేని పని మీరు చెయ్యనేవద్దు."

"బాబుని ఎత్తుకోవటం నా కిష్టం లేదా? ఎవ రన్నారు?"

"ఎవ రన్నా నేను నమ్మను. ఎవరన్నా నేను వూరుకోను. మీరే అన్నారు. ఇక నుంచి వాణ్ణి ఎత్తుకోవద్దని మళ్ళీ చెప్తున్నాను."

"తీవ్రంగా అన్నాడు శివరాం—" నా కొడుకుని నన్ను ఎత్తుకోవద్దనటానికి నువ్వెవరివి మధ్య?"

"మీ కొడుకా?" సంభ్రమంగా అంది శశిరేఖ — "మీరు ఆలోచించే మాట్లాడుతున్నారా? నల్లటి నలుపు ... పీచు జుట్టు...తెగుళ్ళతో తయారైన ఎముకల గూడు...మీకు చూడగానే అసహ్యం వేసే వీడు మీ కొడుకా? మీరు మనస్సుని ఎంత బాధ పెట్టుకుని ఈ విషయము ఒప్పుకున్నారో నేను వూహించలే ననుకున్నారా?"

"శశీ!"

"నేను మిమ్మల్ని తప్పు పట్టటంలేదు. అందమైన — ఆరోగ్యమైన బిడ్డలు కావాలని తల్లిదండ్రులు కోరుకోవటంలో అత్యాశ ఏమీలేదు. మీ కోరిక ఎంత

సహజమైనదైనా తీరేదికాదు. బాబుకి ఎంతమంది తమ్ముళ్ళు పుట్టినా... ఎంత మంది చెల్లెళ్ళు పుట్టినా ... వీడికన్న అందముగా వుండరు. వీడికన్న తెల్లగా వుండరు. వీడికన్న ముద్దుగా వుండరు. పరాయివారి బిడ్డల్ని చూసి మాత్రమే సంతృప్తి పడాల్సిన ఏ దౌర్భాగ్యానికి నేనుకూడా ఎంతో విచారిస్తున్నాను.

మీరు ... ఆదిలోనే పెద్దపొరపాటు చేశారు మీ బిడ్డలకు తల్లి కాబోయే వ్యక్తిని నిర్ణయించుకునే సమయంలో చాలా ఆలోచనారహితంగా ప్రవర్తించారు కన్నతల్లి రూపలావణ్యాలూ ... అందచందాలూ బిడ్డలకు సంక్రమిస్తాయని ఆలోచించలేనంత అవివేకంగా ప్రవర్తించారు.''

శశిధోరణికి విస్తుబోయాడు శివరాం - "శశీ నీ అందచందాలను ఎన్నడైనా కించపరిచానా ? నిన్ను మనస్ఫూర్తిగా అంగీకరించేకదా పెళ్ళి చేసుకున్నాను. ఎందుకంత బాధపడతావు ?''

నిస్తేంజగా చూసింది శశి —— ''బాధ గాక ఏముంది ? అందమైన బిడ్డల్ని కని భర్తకు అందించలేని ఆడదానికి బాధగాక ఏం మిగులుతుంది ? తండ్రి ప్రేమకు నోచుకోని బిడ్డలకు దుఃఖంగాక ఏం దక్కుతుంది? మీరు నన్నూ నా అందచందాలనూ ఎంత విమర్శించినా ఇంత బాధ పడేదాన్ని కాను. నేను కన్నబిడ్డని...వాడి అందాన్ని ...మీరు హీనంచేస్తోంటే ... ఎవరోకాదు...సాక్షాత్తూకన్నతండ్రి..." మాట్లాడలేకపోయింది.

తదేకంగా శశిని చూస్తూవున్న శివరాం తనలో తను అనుకొంటూన్నట్టే అన్నాడు : "శశీ : నిజంగా నేను తెలివి తక్కువగా మాట్లాడాను. బాబుని విమర్శించుకుంటున్నా నన్న జ్ఞానం కూడా లేకుండా ఏమో అన్నాను. కాని...వాణ్ణి నేను ఎన్నడూ నిర్లక్ష్యం చెయ్యలేను శశీ: నన్ను నమ్ము."

"అదంతా నేను ఆలోచించలేను—" దృఢంగా అంది శశి "మీరు వీడికి తండ్రి. మీనుంచితండ్రిప్రేమ అన్నివిధాలా వీడికి దక్కాలని కోరుకున్నాను మీ యిష్టాలూ అయిష్టాలూ నాకు తెలీవు. మీ ఉదాసీనతని...ఎంత దాగివున్నా బాబుకి తల్లిగా నేను సహించలేను. ఇది మూర్ఖత్వమే అయితే ఇదే నన్ను జీవితమంతా వెన్నాడుతుంది." ఎంత ప్రయత్నించినా శశి కన్నీళ్ళు ఆగలేదు. చెంపలమీదుగా జారసాగాయి

శివరాం శశికి దగ్గిరిగా వెళ్ళి భుజం మీద చెయ్యి వేసి కన్నీళ్ళు తుడుస్తూ అన్నాడు.—— "నన్ను క్షమించు శశీ! నా మూర్ఖత్వం నాకు బాగా అర్థమైంది. బాబు జన్మకి నువ్వొక్కదానివే కారణం కాదు. నేనుకూడా. ఇక నన్నెప్పుడూ యిలా శిక్షించకు శశీ! ఏదీ! నా బాబుని భుజంమీద వేసుకుంటాను. నువ్వు అన్నం తిను," అంటూ కొడుకుని అందుకుంటోంటే శశి వారించలేదు.